సాక్షి
కుమురం భీం

ఆదివారం । 16 । మార్చి । 2025



పంటలపై పందుల ప్రతాపం

సిర్పూర్(టి) మండలంలోని అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో అడవి పందుల బెడదతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

9లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:22	సోమ : 5:07

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.4 /24.6

ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. అర్ధరాత్రి వరకు వేడి సెగలు కొనసాగుతాయి. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేషనల్ జూరిస్ట్ కాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి



కాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో శనివారం నిర్వహించిన నేషనల్ జూరిస్ట్ కాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పలువురు హైకోర్టు న్యాయమూర్తులతో పాటు పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది బోనగిరి సతీశ్ బాబు, బ్రహ్మకుమారీ దీదీ పాల్గొన్నారు.

అంతర్జాతీయ బౌద్ధ సమ్మేళనానికి ఎంపిక



అశోక్ మహోల్కర్

వాంకిడి: భూటాన్ దేశంలో నిర్వహించే అంతర్జాతీయ బౌద్ధ సమ్మేళనానికి వాంకిడి మండల వాసి, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ ఎంపికైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరంధాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 22 వరకు నిర్వహించే సమ్మేళన కార్యక్రమంలో భారతదేశం నుంచి 35 మంది పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. భగవాన్ బుద్ధుడు, బౌద్ధ మత సిద్ధాంతాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

31లోగా ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లిస్తే 25 శాతం రాయితీ



మాట్లాడుతున్న డీపీవో భిక్షపతిగౌడ్

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ రుసుం ఈ నెల 31లోగా చెల్లిస్తే 25 శాతం రాయితీ వర్తిస్తుందని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులకు వివరాలందించేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తుదారులు lrs.telangana.gov.in ద్వారా వివరాలు తెలుసుకోవచ్చన్నారు. సందేహాలు నివృత్తి చేసుకునేందుకు కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్ట్



వేటగాళ్లతో అటవీశాఖ అధికారులు

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ అటవీ ప్రాంతంలో నీలుగాయిని హతమార్చిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు పెంచికల్‌పేట్ డిప్యూటీ రేంజ్ అధికారి జమీల్ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి కొమ్ముగూడ-అగర్‌గూడ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించి విచారించగా అగర్‌గూడ బీట్ పరిధిలో విద్యుత్ తీగలను అమర్చి నీలుగాయిని హతమార్చినట్లు అంగీకరించారన్నారు. సంఘటన స్థలానికి తీసుకెళ్లి వేటాడటానికి ఉపయోగించిన తీగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నీలుగాయిని వేటాడిన పెంచికల్‌పేట్‌కు చెందిన అప్పాజి శ్రీనివాస్, అప్పాజి వెంకటేశ్, మేకల రమేశ్, ఒడ్డుగూడకు చెందిన బీంకరి తిరుపతిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు. ఆయన వెంట బీట్ అధికారులు సతీశ్, సంగదీప్, మహేశ్, దినేశ్, సిబ్బంది ఉన్నారు.

'కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి'

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో పనిచేస్తున్న హౌస్ డిస్మెంటలింగ్ కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, నాయకులు ఫిరోజ్‌ఖాన్, ప్రేంకుమార్, సంపత్ శనివారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అతని వద్ద పని చేసే అన్‌స్కిల్డ్ కాంట్రాక్టు కార్మికులకు రోజుకు రూ.526 ఇవ్వాల్సి ఉండగా రూ.440 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఇతర సమస్యలపై కార్మికులు ఈనెల 8న జీఎంను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో కక్షగట్టి సదరు కాంట్రాక్టర్ కార్మికులను విధుల్లోకి తీసుకోవడం లేదన్నారు.

రూటు మార్చిన రేషన్ దొంగలు



గుండాయిపేట వద్ద వార్ధానది

- రోడ్డు, రైలుమార్గంపై అధికారుల నిఘా
- తరచూ పట్టుబడుతున్న వైనం
- జలమార్గాన్ని ఎంచుకున్న అక్రమార్కులు..
- రైస్ మిల్లులకు బియ్యం తరలింపు

జిల్లా వివరాలు

మండలాలు 15	గ్రామ పంచాయతీలు 334	రేషన్ షాపులు 303
ఆహార భద్రత కార్డులు 1,39,784	అంత్యోదయ కార్డులు 13,024	అన్నపూర్ణ కార్డులు 21
ప్రతీనెల పంపిణీ చేస్తున్న బియ్యం 3వేల మెట్రిక్ టన్నులు		

కౌటాల: పేదల కడుపు నింపాల్సిన బియ్యం అక్రమార్కుల జేబులు నింపుతున్నాయి. 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందంగా.. ఇందులో అందరికీ వాటాలు ఉండడంతో రాయితీ బియ్యం పొరుగున ఉన్న మహారాష్ట్రలోని ఆయా గ్రామాలకు తరలించడం నిత్యకృత్యంగా మారింది. దళారులతో పాటు రేషన్ డీలర్లు సైతం లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి దందాను కొనసాగిస్తున్నారు. జిల్లాలో పీడీఎస్ బియ్యం దందాను అరికట్టేందుకు అధికారులు, పోలీసుశాఖ చేస్తున్న ప్రయత్నాలకు రేషన్ దుకాణాల డీలర్లే గండికొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దందాకు లోపాయికారిగా డీలర్లే సహకరిస్తుండడంతో జిల్లాలో పీడీఎస్ బియ్యం దందా బహిరంగంగానే కొనసాగుతోందనే విమర్శ వినిపిస్తోంది. అనేక మంది లబ్ధిదారులకు దుకాణాల వద్దే రేషన్ డీలర్లు నేరుగా కిలోకు రూ.16 నుంచి రూ.18 వరకు చెల్లిస్తున్నారు. 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు పోగు చేసి మహారాష్ట్రలో రూ.26 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. ఇక్కడ పాలిష్ చేసి, ప్యాక్ చేసి ఇతర ప్రాంతాలకు అమ్ముతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రేషన్ దందాపై పోలీస్‌శాఖ ఉక్కుపాదం మోపడంతో అక్రమార్కులు దందా రూట్ మార్చినట్లు తెలుస్తోంది.

రైస్ మిల్లులకు తరలింపు?

జిల్లాలో చాలా మంది ప్రజలు సన్న బియ్యం తింటుండగా ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండడంతో చాలామంది వాటిని తినడానికి ఇష్టపడడం లేదు. రేషన్ దుకాణాల్లో విక్రయించి వాటి బదులు డబ్బులు, నిత్యావసర వస్తువులు తీసుకుంటున్నారు. దీంతో నేరుగా డీలర్లే పెద్ద మొత్తంలో రేషన్ బియ్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారు. రేషన్ డీలర్ల వద్ద నుంచి కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని దళారుల నుంచి జిల్లాలోని కొందరు రైస్ మిల్లర్లు కేజీకి రూ.26 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. అర్ధరాత్రి, తెల్లవారుజామున టాటా ఏసీట్రాలీ, డీసీఎం వ్యాన్‌లలో గుట్టుచప్పుడు కాకుండా రైస్ మిల్లర్లు చెప్పిన రహస్య ప్రదేశాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బియ్యాన్ని మిల్లర్లు మహారాష్ట్రకు తరలించడంతో పాటు రీసైక్లింగ్ చేసి తిరిగి సివిల్ సప్లై గోడౌన్‌లకు పంపిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా కట్టడి చేయాల్సిన సివిల్ సప్లై శాఖలోని ఒకరిద్దరు అధికారులే ఈ దందాను ముందుండి నడిపిస్తున్నారనే విమర్శలున్నాయి. చౌకధరల దుకాణాల ద్వారా ఇస్తున్న బియ్యం పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకే అందేలా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ప్రభుత్వం వేలిముద్రల నిబంధన ప్రవేశపెట్టినా.. అక్రమ దందా మాత్రం ఆగడం లేదు. లబ్ధిదారులతో రేషన్ దుకాణాల్లో వేలిముద్రలు వేయించి నేరుగా అక్కడి నుంచే పీడీఎస్ బియ్యం బొలెరో వాహనాల్లో మహారాష్ట్రకు తరలిస్తున్నారు. గతంలో లబ్ధిదారులు ఇళ్ల వద్దకు వెళ్లి ఏజెంట్లు బియ్యం సేకరించేవారు. కానీ ఈ దందా విస్తరించిన క్రమంలో నేరుగా రేషన్ దుకాణాల నుంచే సేకరించే స్థాయికి చేరుకుంది.

నాటు పడవల్లో..

జిల్లా పోలీసు యంత్రాంగం బియ్యం దందాపై ఉక్కుపాదం మోపుతోంది. రేషన్ బియ్యం అక్రమ దందాను అడ్డుకునేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రోడ్డు మార్గంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుంటున్నారు. ఇటీవల పోలీసులు సిర్పూర్(టి) మండలం హుడ్కిలి వద్ద వాహనాల్లో మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 208 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. దీంతో రోడ్డు మార్గంలో పీడీఎస్ బియ్యం మహారాష్ట్రకు తరలించడం కష్టమని భావించిన అక్రమార్కులు పోలీసులకు చిక్కకుండా దందాలో రూట్ మార్చారు. జిల్లా సరిహద్దు గ్రామాల నుంచి వార్ధా, ప్రాణహిత, పెన్‌గంగా నదుల్లో నాటు పడవల్లో ప్రమాదకరంగా మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాలకు తరలిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని సంచుల్లో మూటలు కట్టి రాత్రి సమయాల్లో జలమార్గం ద్వారా మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని కౌటాల మండలం ప్రాణహిత నదికి సరిహద్దు గ్రామాలు తుమ్మిడిహెట్టి, రణవెల్లి, బూరెపల్లి, కోర్సిని, వార్ధా నది సరిహద్దు గ్రామాలు గుండాయిపేట, వీర్దండి, తాటిపల్లి, లోనవెల్లి, సాండ్‌గాం గ్రామాల మీదుగా నది మార్గన తరలించి సొమ్ము చేసుకుంటూ అధికారులకు సవాళ్లు విసురుతున్నారు. కొందరు అక్రమార్కులు రైలు మార్గన సైతం మహారాష్ట్రకు బియ్యం తరలిస్తూ దందా చేస్తున్నారు.

పీడీయాక్టు నమోదు చేస్తాం



రాయితీ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తాం. అసాంఘిక కార్యకలాపాలు, ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై ఉక్కుపాదం మోపాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించాం. 2024 నుంచి జిల్లాలో ఇప్పటి వరకు 124 కేసుల్లో 1,594 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నాం. 214 మందిని రిమాండ్‌కు తరలించాం. తాజాగా హుడ్కిలి చెక్‌పోస్టు వద్ద 208 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టుకుని 12 మందిని రిమాండ్‌కు తరలించాం.

– డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ

ఏఐ బోధన సద్వినియోగం చేసుకోవాలి



ఏఐ విద్యాబోధన పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రెబ్బెన(ఆసిఫాబాద్): కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)తో కూడిన విద్యా బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం మండలంలోని తక్కళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విద్యాబోధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులకు బోధనను అందించే కంప్యూటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలి విడతగా చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం 4 పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం, ఏక్ స్టెప్ ఫౌండేషన్‌ల సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో మరికొన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భాష, గణిత సామర్థ్యాల సాధనను పెంపొందించేందుకు ఈ విద్యాబోధన ఎంతగానో దోహదపడుతుందన్నారు. కృత్రిమ మేధస్సును విద్యారంగంలో అమలు చేయడం విప్లవాత్మకమైన ఆలోచన అన్నారు. ప్రాథమిక స్థాయిలో భాష, గణితంలలో అభ్యాసన సామర్థ్యలతో పాటు కృత్రిమ మేధ సాయంతో ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన సామర్థ్యలను సాధించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలన్నారు. తక్కళ్లపల్లి పాఠశాలలో మార్పులు తీసుకువచ్చిన ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ, సమన్వయ కర్త శ్రీనివాస్, హెచ్‌ఎం మహేశ్వర్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బోధన పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్‌తివారి

ఏఐతో మరింత నైపుణ్యం

కెరమెరి(ఆసిఫాబాద్): ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజన్స్)తో విద్యార్థులు మరింత నైపుణ్యం సాధిస్తారని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం గోయగాం ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం ఏఐ విద్యాబోధన కేంద్రాన్ని ప్రారంభించారు. తెలుగు, గణితం, ఆంగ్లంలో ఏఐ బోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యులతో పాటు పోషకులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు, గణితం, ఆంగ్లంలో వెనుకబడిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసేందుకు ఏఐ పద్ధతిని అవలంబిస్తున్నామన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం రానున్న రోజుల్లో ప్రతీ పాఠశాలకు చేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులకు సద్వినియోగం చేయాలని, ప్రతీరోజు పిల్లలను బడికి పంపించాలని పోషకులను కోరారు. అనంతరం ఝరి ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ జరుగుతున్న పెయింటింగ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆడే ప్రకాశ్, ఝరి హెచ్‌ఎం భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యవర్తుల వ్యవస్థపై చర్యలు తీసుకోవాలి'



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయంలో కొనసాగుతున్న మధ్యవర్తి వ్యవస్థపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ, టీఏజీఎస్ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏవో మధుకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ జిల్లాలో వాహనాల రిజిస్ట్రేషన్‌లు, లైసెన్స్‌ల కోసం ఆన్‌లైన్‌లో అప్‌లై చేసుకుని ఆర్టీవో కార్యాలయానికి వెళ్తే మధ్యవర్తులతో రావాలని వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వేరే అవకాశం లేక తప్పని పరిస్థితుల్లో మధ్యవర్తులతోనే పనులు చేయించుకోవాల్సి వస్తోందన్నారు. అమాయకులను ఆసరా చేసుకుని అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారన్నారు. కార్యాలయంలో ఏ వాహనానికి ఎంత చలాన్ చెల్లించాలో ధరల పట్టిక కూడా పెట్టడం లేదన్నారు.

'అంగన్‌వాడీల ధర్నా విజయవంతం చేయాలి'



పీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 17, 18 తేదీల్లో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న 48 గంటల ధర్నా విజయవంతం చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి త్రివేణి పిలుపునిచ్చారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్‌ను వెంటనే రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన జాతీయ విద్యావిధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఆపాలని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని శనివారం జిల్లా కేంద్రంలో ఐసీడీఎస్ పీడీ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని, పేద ప్రజలతో పాటు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లకు నష్టం వాటిల్లే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వనిత, సువర్ణ, వినోద, అంజలి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

'బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సంపూర్ణ మద్దతు'

రెబ్బెన: బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూ నియన్స్ ఆధ్వర్యంలో చేపట్టనున్న సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కా రం కోసం కేంద్రంపై ఎంత ఒత్తిడిని పెంచుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య దోరణికి వ్యతిరేకంగా ఈనెల 24, 25 తేదీల్లో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్, ఇండియన్స్ బ్యాంక్ అసోషియేషన్స్ పిలుపు నిచ్చాయన్నారు. దేశ వ్యాప్తంగా 9 బ్యాంకు ఉద్యోగ సంఘాలతో కూడిన ప్రతినిధి వర్గం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను ఆపాలని డిమాండ్ చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమ్మె అనివార్యమైందన్నారు.

మిషన్ భగీరథ నీళ్లు వచ్చేదెప్పుడు?



అందవెల్లి వంతెన వద్ద అడ్డంగా వేసిన రాళ్లు

దహెగాం: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగుపై కూలిన వంతెన స్థానంలో మరోవంతెన నిర్మించారు. అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించి నెల రోజులు కావస్తోంది. భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ తొలగించి కూడా నెల దాటింది. అప్పటి నుంచి దహెగాం, భీమిని, కన్నెపల్లి మండలాల్లోని 64 గ్రామాలకు భగీరథ నీటి సరఫరా నిలిచి పోయింది. అప్రోచ్ రోడ్డు పనులు పూర్తయి వారంరోజులు కావస్తోంది. ప్రస్తుతం రివిట్‌మెంట్ పనులు కొనసాగుతుండగా అందుకు వాడే బండరాళ్లను రోడ్డుపై పైప్‌లైన్‌కు అడ్డుగా వేయడంతో పనులు చేయలేక పోతున్నామని భగీరథ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో నాలుగు మండలాల్లోని 64 గ్రామాల ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు పూర్తి చేయలేక పోవడంతో తాగు నీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భగీరథ పైప్‌లైన్ వేయడానికి అడ్డుగా ఉన్న బండరాళ్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పట్టుదలతో చదివి.. కొలువులు సాధించి

- నాలుగు ఉద్యోగాలు సాధించిన యువకుడు
- ఆదర్శంగా నిలుస్తున్న సాయిరాంగౌడ్




తల్లిదండ్రులతో సాయిరాంగౌడ్

కౌటాల: ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించి సత్తా చాటాడు ఆ పేదింటి యువకుడు.. ప్రభుత్వ ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలవాలని భావించాడు కౌటాల మండలం తలోడి గ్రామానికి చెందిన మండల సాయిరాంగౌడ్. ఇప్పటి వరకు నాలుగు ఉద్యోగాలు సాధించి ఔరా అని పించాడు. మండల రాజేశంగౌడ్- తారక్క దంపతుల కుమారుడు సాయిరాంగౌడ్ హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశాడు. తల్లి గృహిణి కాగా తండ్రి వృత్తిరీత్యా గీత కార్మికుడు. తల్లిదండ్రుల కష్టాలను చూసి భవిష్యత్‌లో మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో తొలి ప్రయత్నంలోనే గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కొలువు సాధించి ప్రస్తుతం బెజ్జూర్ మండలం మొగవెల్లి గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న క్రమంలో గతేడాది గ్రూప్–4 ప్రకటన వెలువడగా అందులో ఉత్తీర్ణత సాధించి రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ నెల 11న వెలువడిన గ్రూప్–2 ఫలితాల్లో 388 మార్కులతో రాష్ట్రస్థాయిలో 191వ ర్యాంకు సాధించాడు. శుక్రవారం ప్రకటించిన గ్రూప్–3 ఫలితాల్లో సైతం రాష్ట్రస్థాయిలో 349 ర్యాంక్‌ను సాధించాడు. గ్రూప్–1 మెయిన్స్‌లో 436 మార్కులు సాధించానని, సివిల్స్ సాధించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నాడు. సాయిరాంగౌడ్‌ను కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

డ్రైవింగ్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని వెనుకబడిన తరగతుల యువతీ, యువకులకు డ్రైవింగ్ కోర్సులో ఉచితంగా శిక్షణను అందించేందు కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సజీవన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 38 రోజుల శిక్షణ పూర్తయిన అనంతరం రవాణా సంస్థ అర్హత కలిగిన అభ్యర్థులకు పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగా అందిస్తుంది. హకీంపేటలోని టీఏ, జెడ్‌ఎస్‌టీసీ (టీజీఆర్టీసీ) ద్వారా అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నారు. అభ్యర్థులు ఎల్‌ఎంవీ కోసం 18 నుంచి 45, హెచ్‌ఎంవీ కోసం 20 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉండి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల వారికి ఆదాయం ఏడాదికి రూ.1.50 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలలోపు ఉండాలన్నారు. 3 పాస్‌పోర్ట్ ఫోటోలు, లర్నింగ్ లైసెన్స్‌లతో జిల్లాలోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఈనెల 15 నుంచి 31 సాయంత్రం 5 గంటల్లోగా కార్యాలయ పనివేళల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు, ట్రాన్స్‌జెండర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.









కవ్వాల్.. విహంగాల విడిది

జన్నారం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్ వన్యప్రాణులకే కాకుండా పక్షులకు ఆవాసంగా మారింది. స్థానిక పక్షులకే కాకుండా విదేశీ పక్షులు కూడా ఇక్కడికి వస్తున్నాయి. జన్నారం అటవి డివిజన్‌లోని మైసమ్మకుంట, బైసన్‌కుంట, కల్పకుంట, ఘనిషెట్టికుంట ప్రాంతాలు పక్షులకు ఆవాసంగా మారాయి. విదేశీ పక్షులైన లెజర్ విజ్లింగ్ డక్స్, ఆసియన్ ఓపెన్ బిల్‌స్టోర్క్, ఇండియన్ స్పాట్ బిల్డ్ డక్, హర్న్ బిల్‌తోపాటుగా ఇండియన్ పక్షులు ఇక్కడికి వస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన బర్డ్‌వాక్, పక్షుల సర్వేతో పక్షులపై ఈ ప్రాంత వాసులకు మక్కువ పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పక్షుల ఆవాసాలను మరింత అభివృద్ధి చేస్తామని రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు.

క్లుప్తంగా

జీవో 3ను పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సచిన్

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం జీవో 3ను పునరుద్ధరించి ఆదివాసీలకు ఉద్యోగాలు దక్కేలా చూడాలని టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. బెంగుళూర్‌లో నిర్వహిస్తున్న ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సమావేశాల్లో ఆయన రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొని మాట్లాడారు. జీవో 3ను పునరుద్ధరణ చేసే అధికారం, అవకాశం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందన్నారు. అయితే ఆ దిశగా ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలోనైనా కేంద్రం స్పందించి 5వ షెడ్యూల్‌లో ఆదివాసీ యువతకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మట్కా జూదరుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన నలుగురు మట్కా జూదరులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక గాంధీనగర్‌లో మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురి నుంచి రూ.3200 నగదుతో పాటు 17 మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నారు. ఇందిరానగర్‌కు చెందిన అబ్దుల్ ఫరీద్, భుక్తాపూర్‌కు చెందిన షేక్ అజీమ్, గాంధీనగర్‌కు చెందిన మారుతీ, చిల్కూరిలక్ష్మీనగర్‌కు చెందిన షేక్ అలీమ్‌ను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ కరుణకర్ రావు తెలిపారు. కాగా వీరిని ప్రోత్సహిస్తున్న మునీర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

పండిద్దాం పొగాకు..

- చెన్నూర్ చేలల్లో సాగు..
- పంట మార్పిడికి ముందుకు వస్తున్న రైతులు
- తక్కువ నీటి వసతి.. ఎక్కువ దిగుబడి
- పంటను ఆశించని తెగుళ్లు


అక్కెపల్లి సమీపంలో సాగవుతున్న పొగాకు పంట


శివలింగాపూర్ సమీపంలో తోరణాలుగా ఆరబెట్టిన పొగాకు

చెన్నూర్‌రూరల్: ఎప్పుడూ ఒకే రకం పంటల సాగుతో భూమిలో సారం దెబ్బతింటుంది. పంట మార్పిడి విధానం పాటించాలని వ్యవసాయాధికారులు కూడా తరచూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే చాలా మంది రైతులు దీనిని పట్టించుకోరు. కానీ, చెన్నూరు మండలంలో కొందరు రైతులు అధికారుల సూచనలతో పంట మార్పిడి విధానంతో లాభాలు గడిస్తున్నారు. మిర్చి పంట సాగు చేసి పురుగు ఆశించడం, సరైన దిగుబడి రాకపోవడం, మద్దతు ధర లేకపోవడంతో విసిగిపోయిన రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. కొందరు మిర్చి పంటకు బదులుగా పొగాకు సాగుచేస్తున్నారు. ఈ పంటకు తక్కువ నీరు, తెగుళ్ల బెడద లేకపోవడంతో సాగుకు చాలా మంది ముందుకు వస్తున్నారు. చెన్నూర్ మండలంలో గతేడాది కేవలం రెండెకరాల్లో పొగాకు సాగు కాగా, ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా సుమారు 20 ఎకరాల వరకు సాగు చేశారు. చెన్నూర్ మండలం అక్కెపల్లి, శివలింగాపూర్‌లో మాత్రమే సాగవుతుంది. మిర్చి, పత్తి పంట పెట్టుబడి తరహాలోనే పొగాకు పంటకు పెట్టుబడి అవుతుందని, లాభాలు మాత్రం ఎక్కువగా ఉంటున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

చీడ, పీడలు, తక్కువే..

పొగాకు పంటలో కలుపు, తెగుళ్ల బెడద ఉండదు. ఒక లద్దె పురుగు, తేనె మంచు మాత్రమే ఆశిస్తుంది. దీని నివారణకు లామ్డాసైహలోత్రిన్, ఇమిడాక్లోప్రిడ్ మందును ఎకరాకు 120 ఎంఎల్ పిచికారీ చేస్తే సరిపోతుంది. లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 60 ఎంఎల్ పిచికారీ చేయాలి. ఈ పంటకు కోతులు, అడవి పందులు, పశువుల బెడద ఉండదు.

ఆరబెట్టే విధానం..

పంట వేసిన ఐదు నెలలకు దిగుబడి చేతికి వస్తుంది. ఆకులను తెంపి సోలార్ కవర్ ఉన్నట్లయితే 8 నుంచి 10 రోజులు ఆరబెడితే సరిపోతుంది. లేదంటే తోరణాలుగా తయారు చేసి 20 రోజుల నుంచి 25 రోజులు ఆరబెట్టాలి. మార్కెట్‌కు తీసుకువెళ్లే సమయంలో బేల్లుగా తయారు చేసి తేమశాతం లేకుండా చూసుకోవాలి. క్వింటాల్ ధర రూ.15 వేల వరకు వస్తుంది. జనగామ జిల్లా ములకనూరులో పొగాకు మార్కెటింగ్ సౌకర్యం ఉన్నప్పటికి ఆశించిన స్థాయిలో మద్దతు ధర రాకపోవడంతో రైతులు ఆంధ్రకు వెళ్లాల్సి వస్తుంది. రైతులు ఒకే రకం పంట సాగు చేయకుండా ఇలా పంట మార్పిడి చేస్తే అధిక లాభాలు పొందవచ్చు.

సాగు విధానం

పొగాకు ఐదు నెలల పంట. ఆగస్టు, సెప్టెంబర్‌లో సాగుచేయాలి. ఇక్కడి రైతులకు నారు ఆలస్యంగా రావడంతో నవంబర్‌లో మొక్కలు పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కొత్తూరులోని జీపీఏ కంపెనీ వారు నారును అందించారు. ఒక్కో మొక్కకు రూ.1 చొప్పున పడుతుంది. ఎకరాకు 10 వేల మొక్కలు నాటుతారు. జీపీఏ కంపెనీ వారే పండిన పంటను కొనుగోలు చేస్తారు. ఇక్కడ సాగు చేసే పొగాకు రకం వైట్‌బెర్లీ రకం. ఎకరాకు రూ.70 వేలు ఖర్చవుతుంది. మొక్కలు నాటుపెట్టే సమయంలో ఆఖరి దుబ్బులో 15 కిలోల యూరియా, ఒక డీఏపీ 50 కిలోల బస్తా వేస్తారు. నాటుపెట్టి ఆకులు వచ్చే సమయంలో 50 కిలోల పొటాష్‌ని వేస్తారు. నీటితడులు మూడుసార్లు మాత్రమే అందిస్తారు. 25 రోజుల్లో అందించాల్సి ఉంటుంది. నాటు పెట్టిన 50 రోజుల్లో ఒక అమ్మోనియా వేస్తారు. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

రైతులు ముందుకు రావాలి


పంట మార్పిడిని అవలంబించేందుకు రైతులు ముందుకు రావాలి. అక్కెపల్లి, శివలింగాపూర్ గ్రామాల రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. ఈ పంటకు ఎలాంటి తెగుళ్లు ఆశించవు. పశువులు, అడవిపందులు, కోతుల బెడద ఉండదు. నీటి తడులు కూడా తక్కువగా ఉంటాయి. రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

– యామిని, ఏవో, చెన్నూర్

పంట మార్పిడి చేయాలి


ఎప్పటికీ ఒకే రకం పంటలు కాకుండా పంట మార్పిడి చేస్తే భూసారం దెబ్బతినకుండా ఉంటుంది. మా క్లస్టర్‌లో కొందరు రైతులు పొగాకు సాగు చేశారు. పంట దిగుబడి కూడా బాగానే వస్తుంది. రైతులు ఆలోచించాలి.

– రాజశేఖర్, ఏఈవో, అక్కెపల్లి, క్లస్టర్

ఆరెకరాల్లో సాగుచేశా


మిర్చి, పత్తి సాగు చేస్తే పురుగు, తెగుళ్లు ఆశిస్తే దిగుబడి రాక నష్టపోవాల్సి వస్తుంది. గతేడాది రెండెకరాల్లో పొగాకు సాగు చేశాను. మంచి లాభం వచ్చింది. ఈ ఏడాది ఆరు ఎకరాల్లో సాగు చేశాను.

– హన్మంతరావు, రైతు, శివలింగాపూర్

దిగుబడి చేతికి వస్తోంది


కొన్నేళ్లుగా పత్తి, మిర్చి, వరి సాగు చేస్తున్నాను. ఈ ఏడాది పంట మార్పిడి చేయాలని అనుకున్నా. మరో రైతును అడిగితే పొగాకు వేయాలని సూచించాడు. రెండెకరాల్లో సాగు చేశాను. పంట ఇప్పుడే చేతికి వస్తుంది.

– బజ్జూరి లచ్చన్న, రైతు, అక్కెపల్లి

తండ్రిపై దాడికి సుపారీ..

- స్నేహితుడికి రూ.50 వేలు ఇచ్చిన కొడుకు
- దాడిచేసి గొలుసు ఎత్తుకెళ్లిన దుండగులు
- 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్, ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తండ్రి, కొడుకు మధ్య కొన్ని రోజులుగా తలెత్తిన గొడవ చివరకు దాడి దారితీసింది. తండ్రి గొడవతో విసిగిపోయిన కొడుకు దాడి చేయించేందుకు స్నేహితుడికి సుపారీ ఇచ్చాడు. సుపారీ తీసుకున్న స్నేహితుడు దుండగులతో దాడి చేయించడంతోపాటు బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లిలో జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు 24 గంటల్లో కేసును ఛేదించారు. మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, హాజీపూర్ ఎస్సై సురేశ్ హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. వేంపల్లికి చెందిన నాగిరెడ్డి సత్యానందం-సరస్వతి దంపతులకు కొడుకు రమేశ్ ఉన్నాడు. దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని రోజులుగా తండ్రి, కొడుకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రమేశ్ తండ్రిపై దాడి చేయించేందుక అతని స్నేహితుడు సొల్లు అవినాశ్‌కు రూ.50 వేల సుపారీ ఇచ్చాడు. దీంతో అవినాష్ గర్మిళ్లకు చెందిన అందె అశోక్, అట్ల సంతోష్, ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మామిడిపల్లి చందు, చింతల కృష్ణతో కలిసి దాడికి ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సత్యానందర్ ఇంట్లో ఉండగా దాడి చేయించాడు. అంతేకాకుండా అతని మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. దీంతో బాధితుడు సాయంత్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు.

కొడుకుపై అనుమానంతో..

ఈ క్రమంలో కొడుకుపై అనుమానం రావడంతో అతడిని విచారణ చేశారు. దీంతో జరిగిన విషయం చెప్పాడు. దీంతో పోలీసులు అవినాశ్‌తోపాటు అశోక్, సంతోష్, చందు, కృష్ణను కూడా అదుపులోకి తీసుకున్నారు. 24 గంటల్లో దాడి కేసును ఛేదించారు. అయితే విచారణలో రమేశ్ చెప్పిన విషయాలు విని పోలీసులు షాక్‌కు గురయ్యారు. కేవలం కుటుంబ కలహాలతో కన్న తండ్రిపైనే దాడికి సుపారి ఇచ్చినట్లు రమేశ్ పోలీసులకు తెలిపాడు. నిందితుల నుంచి తులం బంగారు గొలుసు, సుపారీ కింద ఇచ్చిన రూ.30,670 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల్లో కేసు ఛేదించిన మంచిర్యాల రూరల్ సీఐ ఆశోక్, హాజీపూర్ ఎస్సై సురేశ్, సీసీసీ ఎస్సై సుగుణాకర్, ఏఎస్సై ఎజాజ్, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, నరేందర్, ఎస్‌కే.పాషాను సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ అభినందించారు.

మత్తడి ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్ట్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చాకేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గున్నికుంట చెరువు మత్తడి ధ్వంసం చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. ఈనెల 11న చాకేపల్లి గ్రామానికి చెందిన దుర్గం రాజయ్య గున్నికుంట చెరువు పక్కన ఉన్న తన చేనులో చెరువు భూమి కబ్జా చేసుకున్నాడు. తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌కు చెందిన జేసీబీ సహాయంతో తన భూమిలో తుమ్మ చెట్లను తొలగించాలని సూచించిన రాజయ్య అనంతరం గున్నికుంట చెరువు మత్తడి, తూము, కట్టను ధ్వంసం చేస్తే అధిక డబ్బులు ఇస్తానని చెప్పాడు. దీంతో విష్ణువర్ధన్ చెరువు మత్తడి, తూము, కట్టను ధ్వంసం చేసి ఆ మట్టిని చెరువులో వేసి చెరువు భూమిని రాజయ్య భూమిలో కలిపాడు. దీంతో చెరువు భూమి కబ్జాపై ఇరిగేషన్ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న ఇరిగేషన్ ఏఈఈ సునీత భూమి కబ్జా అయినట్లు గుర్తించి తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రమేశ్ నిందితులు దుర్గం రాజయ్య, విష్ణువర్ధన్‌ను శనివారం అదుపులోకి తీసుకుని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజపర్చామని సీఐ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్‌పై దాడి


శ్రీలతను పరామర్శిస్తున్న సీడీపీవో సరిత

కడెం: మండలంలోని లింగాపూర్ తండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్ ధరంసోత్ శ్రీలతపై అదే తండాకు చెందిన సురేందర్, కమల, సరోజ దాడి చేశారు. శనివారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన సరుకులు తీసుకునేందుకు శ్రీలత వెళ్తుండగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన శ్రీలతను ఖానాపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ టీచర్ శ్రీలతను సీడీపీవో సరిత, సూపర్‌వైజర్లు పరామర్శించారు. హోలీ పండుగ రోజున జరిగిన గొడవ కారణంగానే అంగన్‌వాడీ టీచర్‌పై దాడి జరిగినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భుక్యా రమేశ్ డిమాండ్ చేశారు.

విద్యుత్ కంచెకు తగిలి రైతు దుర్మరణం

నర్సాపూర్ (జి): పంటను అడవి జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకున్న రైతుకు అదే కంచె మృత్యుపాశమై కాటేసిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంపూర్ అనుబంధ నసీరాబాద్ గ్రామానికి చెందిన బొందుగుల మల్లయ్య (54) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. తనకున్న రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. పంటను అడవి జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు చుట్టూ జీఐ వైర్ చుట్టి కరెంట్ కనెక్షన్ ఇస్తుండేవాడు. శుక్రవారం సాయంత్రం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం వరకు మల్లయ్య ఇంటికి రాకపోయేసరికి అతడి భార్య చిన్నక్క వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి చూడగా కరెంట్ షాక్ తగిలి మృతి చెంది ఉన్నాడు. చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి: మద్యం మత్తులో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బుర్సన్‌పటర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లే విద్యాసాగర్(57) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం హోలీ సంబరాల్లో భాగంగా అతిగా మద్యం తాగాడు. అదే మత్తులో సాయంత్రం చేనుకు వెళ్లి అక్కడ గుర్తు తెలియని పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించి 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై మరొకరు..

బజార్‌హత్నూర్: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రాంనగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై అప్పారావ్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతర్ల గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్ గ్రామానికి చెందిన గొడం గంగారాం(54) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం తన పంట పొలంలోని చెట్టుకు తాడుతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ పంచా యతీ పరిధి మొర్రిగూడెం గ్రామానికి చెందిన ఆకుల సత్తెన్న (42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 20 ఏళ్ల క్రితం వివాహమైన సత్తెన్నకు సంతానం కలగకపోవడం, రెండేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మరణించడంతో మద్యానికి బానిసయ్యాడు. ఒంటరి జీవితం గడుపుతున్న అతడు మనస్తాపంతో గతంలో పలు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈక్రమంలో ఈనెల 14న మద్యం సేవించి బాత్‌రూంలో టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు ఆకుల శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామ శివారులోని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఖానాపూర్ సీఐ అజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏఎస్పీ రాజేశ్‌మీనా ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పోలీసులు పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. పేకాడుతున్న 18 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.10,1000 నగదు, 18 సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్రవాహనాలు, నాలుగు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాలకు చెందిన రాజకీయ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఉదయం స్థానిక సంజయ్‌నగర్ సమీపంలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న రేవంత్, నీలకంఠతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీనివాస్, ఆయన భార్యకు గాయాలయ్యాయి. సంజయ్‌నగర్ వైపు నుంచి బైక్‌పై వస్తున్న యువకులు ఎదురుగా ఆటోను ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో రిమ్స్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నసీరాబాద్ గ్రామ శివారులో..

నర్సాపూర్ (జి): మండలంలోని నసీరాబాద్ గ్రామ శివారు 61వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలం ఎడ్దూర్ పొట్పెల్లి గ్రామానికి చెందిన గంజిగం కార్తిక్ ద్విచక్ర వాహనంపై నిర్మల్‌లో తన పని ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. చాక్‌పల్లి గ్రామానికి చెందిన షాదుల్లా టీవీఎస్ ఎక్సెల్‌పై నిర్మల్ వైపు అతివేగంగా వెళ్తూ నసీరాబాద్ గ్రామ శివారు 61 జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కార్తిక్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కార్తిక్ ఎడమకాలు విరిగిపోయింది. క్షతగాత్రుడిని గ్రామస్తులు 108 వాహనంలో నిర్మల్ ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. షాదుల్లాపై కేసు నమోదు చేయాలని కార్తిక్ తండ్రి సాయినాథ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.